శ్రీధర్ పకపకా నవ్వి, వేణుగోపాల్ వీపు చరిచేడు.

ఇందిర సంభాషణ నేర్పుగా మార్చింది, కంట్రోళ్ళని గురించి, ధరల పెరుగుదలని గురించి. కాని వేణుగోపాల్ మొదటికే వస్తాడు. "వాటి గురించి నాకు వదిలి పెట్టండి. ఏ వస్తువులు కావల్సివచ్చినా నాకు జాబితా రాసి ఇచ్చెయ్యండి. పంచదార ఇండియాలో దొరక్కపోతే, క్యూబానించి తెప్పిస్తాను. బియ్యం ఇక్కడ



నాటకానికి ఆమె మనస్సు అగ్నిశిఖలా మండిపోతూంది. ఏ నాటినుంచో పన్ని ఉంచిన ఉచ్చు ప్రయోగించే అవకాశం అతడికీనాడు అయాచితంగా దొరికింది. ఆ ఉచ్చులో తను చిక్కుకుంది. సరే. . .ఏం జరుగుతుందో జరగనీ. తన శక్తిమీద తనకు బాగా నమ్మకం ఉంది. లేచి, భర్త చెయ్యి పట్టుకొని నిరసంగా అంది: "ఎందు కంత కోపం! మీరన్నట్టే కానీండి!"

● ● ●

ఎక్స్‌ప్రెస్ కదిలింది. చెయ్యి ఊపుతూ అన్నాడు శ్రీధర్: "పెళ్ళినాటికి అక్కడ తప్పక ఉంటాలే!"

స్టేషన్ దాటక వేణుగోపాల్ అన్నాడు "మీ శ్రీవారు రాకపోవడం మీకు చాలా డిస్‌అపాయింట్‌మెంటు! మీ విచారం పోగొట్టటానికి ఒక మంచి కథ చెబుతాను, వినండి!నే నొకసారి కలకత్తా వెళ్ళేను. అక్కడ మిస్ మాధురి అని ఒక ...

వెంటనే ఇందిర ముఖం ముడుచుకొని అంది: "అవును! మావారు రాకపోవడం నాకు డిస్‌అపాయింట్‌మెంటు. . . కథలంటే నా కిష్టంలేదు!"

వేణు నవ్వి అన్నాడు: "పోనీ . . . కవిత్వం చెప్పనా? పరుగులిడిపోయే ప్రకృతిమీద!"

ఇందిర నిజంగానే భయపడ్డది. రైలు కదిలిందో లేదో! అప్పుడే కవిత్వం అంటాడే. మిస్ మాధురి అంటాడు. ఇక్కడీ మనిషి తనని బలాత్కరిస్తే తన కెవరు దిక్కు! పైగా, అతను తన భర్తపేరుతో ప్రయాణం చేస్తున్నాడు. తను ఫిర్యాదన్నా చేసే అవకాశం లేదు. చేస్తే తన భర్తమీదే చేసినట్టు అవుతుంది. లేదా అందరు పట్టుబడాలి. ఎంత తెలివిగా ఉచ్చులోకి లాగేడు తనను ఈ మనిషి! ఎంత హాయిగా, నిలాసంగా కూర్చున్నాడు! కూనిరాగం తీసి పాటలు పాడుతున్నాడు. పంజరంలో చిక్కుకున్న పక్షి ఎక్కడికీ పోలేదన్న ధీమాతో. ఇప్పు డింకా సాయంత్రం అరయింది. రాత్రల్లా ముందుంది. రేపు పగలు నాలుగు గంటలకికాని ఇది చేరుకోదు మద్రాసు. ఆమె చిరాకుగా అంది: "నాకు చచ్చే తలనొప్పిగా ఉందండీ. కాస్త పాటలు కట్టిపెడతారూ!"

అతడు చాలా శ్రద్ధగా లేచి, ఆత్రంగా అన్నాడు: "తలనొప్పా? ఉండండి. ఆస్ప్రోమాత్రలు పెట్టెలో ఉన్నాయి ఇస్తాను. పాట పాడి మీకు చిరాకు కలిగించి నందుకు క్షమించండి." అతడు లేచి, మీది బ్యాగ్‌లో నుంచి రెండు ఆస్ప్రోబిళ్లలు తీసి ఇచ్చి, మంచినీళ్లు యిచ్చి అన్నాడు: "ఈ ప్రయాణం హడావిడికి తలనొప్పి వస్తుంది లెండి· అందులోకి పగలల్లా ఎండవేడి. నే నింక మిమ్మల్ని విసిగించను లెండి" అంటూ అతను బ్యాగ్‌లోంచి ఒక పుస్తకం తీసి చదువుతూ కూర్చున్నాడు. ఆమె కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది. కొంతసేపయాక అతడు పుస్తకంలో నిమగ్నుడవడం గమనించి, ఆ పుస్తకం ఏమిటా అని పేరు చదివింది. అది వ్లాడిమిర్ నిబకోవ్ రాసిన "లొలితా". తాను విన్నది ఆ పుస్తకం గురించి, తన భర్త చెప్పగా ఎంతో అసహ్యమనిపించింది. అటువంటి పాత్రలు ఉంటాయా? ఉంటే ఉండుగాక, వారి గురించి ఈ రచయితలు ఎందుకు రాయాలి? రాసేరుగాక, అటువంటి రచనలని ఎందుకు ప్రోత్సహించాలి? ఇప్పు డిడిగాడు ఈ పుస్తకం తియ్యడంతో కారణం, తను ఆ పుస్తకం ఏమి టని అడిగితే, దాన్ని గురించి వివరించడానికి. ఛీ! ఎంత సిగ్గుమాలినపనికి పూనుకున్నా డీ మనిషి? అయినా ఆమె అడిగింది, ఒకవేళ చెప్పడం ఆరంభిస్తే నోరు మూయిద్దామని, "ఏమిటండీ ఆ పుస్తకం?" అని.

దీక్షగా చదువుతున్న అతడు ఉలిక్కిపడి, పుస్తకం ముడిచేస్తూ, సిగ్గుపడుతూ అన్నాడు: "అబ్బే! అదేం లేదండీ, ఏదో చెత్త!" అని, ఆ పుస్తకం బ్యాగ్‌లో ఉంచేసి అన్నాడు: "మీ తల నొప్పి పోయిందా?"

ఆమె మనసు చివుక్కుమంది. ఆమె అడిగినదానికి చెత్తజవాబు చెప్పి, తనకు లేని తలనొప్పి గురించి శ్రద్ధగా అడుగుతున్నాడు. ఇతను కోరి తన్ను అవమానిస్తున్నాడు. ఆమెకు జంకు పోయి, కోపం వచ్చింది. విసురుగా అంది "పోలేదు. కవిత్వం ఏదో చెబుతామన్నారు. చెప్పండి, పోతుంది!"

అతడు చిరునవ్వు నవ్వి అన్నాడు: "ప్రకృతికన్న అందమయినది ఈ ప్రపంచంలో లేనేలేదండి. రెండో పంట వేసేరు. చూడండి ఆ వరిచేలు! పచ్చగా హాయిగా. . . గాలికి జాలువారుతూ! ఆ చేలమధ్య కొంగలు . . . స్వచ్ఛంగా . . . దేవుడిమనస్సులా! చేపలు దొరుకుతే తినేస్తాయనుకోండి. అది వేరే సంగతి!"

ఇందిరకి నిజంగా నవ్వు వచ్చింది. నవ్వుతూ అంది: "ప్రకృతికన్న అందమైన వస్తువే లేదా?"

"లేదండీ!"

ఆమె గబుక్కున అంది: "నేనో?!"

అతను బిత్తరపోయి, ఏం చెప్పడానికీ తోచక ఉండిపోయేడు క్షణకాలం. తడబడుతూ అన్నాడు, "మనమంతా ప్రకృతిలోని భాగాలే కదండీ?" అని. అతను కిటికీలోనించి బైటకు చూడసాగేడు, మరి మాట్లాడకుండా.

చెంపమీద ఎవరో ఛెళ్ళున కొట్టినట్టనిపించింది ఇందిరకి. ఆమె ముఖం ఎర్రబడింది. ఎంత అహంకారం ఈ మనిషికి? తనని నిరసన చేస్తున్నట్టు నటిస్తే, తనకు తానై అతడి ఉచ్చులో పడుతుందని ఇతని భావన. తన అందాన్ని గురించి రోజూ శ్రీధర్ ముందు చిలవలూ పలవలూ అల్లేవాడే. ఇప్పుడు తను తెగించి, ప్రోత్సహిస్తే "మనం ప్రకృతిలోని భాగాలే కదా!" అని తనని కూడా కలుపుకున్నాడు అందగాళ్ల జాబితాలో. ఇది మరొక ఉచ్చు, తను అందులో పడడానికి.

రాత్రి ఎనిమిదింటి వరకూ అతనేదో వేదాంతం గురించి మాట్లాడేడు. ఎవరో స్వాములవారుట గాలి తిని హరిద్వారంలో తపస్సు చేస్తున్నారుట. వేదాంతం గురించి, ఈ దేహంయొక్క అనిత్యత గురించి, మిథ్య గురించి మాట్లాడేడు. "ఎవరి కెవరు. . . భర్త ఎవరు. . . పిల్లలెవరు?" అని మాట్లాడేడు. ఇది మరొక ఉచ్చు అనుకుం దామె.

ఒక గంట అతని వాగుడు విన్నాక ఇందిర విసుగు వచ్చి నవ్వుతూ అంది: "అందుకే కామోసు, పెళ్ళీ పెటాకులూ లేకుండా మాలాటివాళ్ల వెంట పడేది!" ఆ మాట అనేసేక ఆమె హడిలిపోయింది. ఈ మనిషి ప్రయత్నిస్తున్నదల్లా తనచేత సరిగ్గా ఈ మాటలు అనిపించడానికే. తనని ఆ ఉచ్చులోకి లాగడానికే. ఇంకేముంది! తనంత తానే అందులోకి దిగింది. ఆమె ముఖం నల్లగా మాడిపోయింది, స్వయాపరాధానికి కోపంచేత, ఆ అపరాధం చేయించిన అతనిమీద అసహ్యంవల్ల.



లోనుండి పైకి...
ఫోటో—డి. వి. రత్నం (మద్రాసు-35)

అతను చాలాసేపు పకపకా నవ్వి అన్నాడు: "మీరు చాలా సహృదయులు సుమండీ!"

ఏమి టలా అన్నాడు. ఇది మరొక ఉచ్చు కామోసు. ఉచ్చులు బిగుసుకుంటున్నాయి. తనింక తప్పించుకో లేదు.

రాత్రి ఎనిమిదింటికి భోజనం వచ్చింది. ఆమె ఏదో తిన్నదనిపించింది. అతను తృప్తిగా, కడుపునిండా తిని, తిన్నాక మళ్ళీ ఉపన్యాసం ఆరంభించేడు.

ఈసారి కాళిదాసు రచనలలోని శృంగారరసం గురించి ఉపన్యాసం ఆరంభించేడు. శకుంతల నాటకం దాని గొప్పదనం గురించి చెప్పేడు. "శకుంతలే ప్రకృతి, ప్రకృతే శకుంతల అనిపించేవిధంగా చేసేడు రచన. ఆ మహాకవి! ప్రకృతికన్యే ఆమె అనిపించింది. కనక శకుంతల మహాసౌందర్యవతి అయింది మన దృష్టిలో ఆ అందంలో వెగటుదనం లేదు. ఏదో ఒక నిర్మలత్వం పవిత్రత ఉన్నాయి. మహాసౌందర్యం అంటే అదే!"

ఆమె అడిగింది కసిగా, అతణ్ణి ఇంక నోరు మూయిద్దామన్నంత విసుగు వచ్చి: "నేను అందమైన దాన్నే అంటారా?"

అతను విస్తుబోయి, మిడిగుడ్లుపెట్టి అన్నాడు: "ఎందు కలా అడిగేరు?"

"నా అందంలో వెగటుదనం ఉందా? లేక నాలో నిర్మలత్వం, పవిత్రత మీకు కనిపిస్తున్నాయా? అవి కనిపిస్తే నేను మహా సౌందర్యవతినే కదా? కాదంటే, నా అందం వెగటు కలిగిస్తున్నదా? ఇది అదీ ఒప్పుకోరూ? అంటే నేను అనాకారినా? ఇప్పటి జవాబు, అరగంటనించికాళిదాసుగురించిచెబుతున్నారు."

ఆమె ఆవేశంగా అడిగింది. అడిగేసిక వెంటనే తన పొరపాటు గ్రహించింది. కోరి కోరి తను ఇతను తవ్విన గోతిలో పడిందే! తన అందం గురించి విచారించి, తీర్పు చెప్పమని అతడిముందు పెట్టింది. ఇంక అతను అందలమెక్కి, తను కుతూహలంతో సమాధానమేదని తీర్పిస్తాడు. ఆ తీర్పిచ్చినందుకు బహుమానం కావాలంటాడు. . . ఏం దారి. . .

అతడు తడబడుతూ అన్నాడు: "మీ కెందుకో నా మీద కోపం వచ్చింది. మీరు అలిసిపోయేరు. . . విశ్రాంతి తీసుకోండి. . ."

ఆ మాటలని అతడు లేచి, వెంగున ఎగిరి, మీద బెర్తు ఎక్కి సాగిలేడు.

ఆమె చకితురాలయింది. వింతగా ప్రవర్తిస్తున్నాడే? తను అనుకున్న దొకటి. ఇతడు చేస్తున్నది మరొకటి. ఏదో ఒకలా అవమానిద్దామని చూస్తున్నాడు. అవమానించి, తన నోక పురుగులా చూసి, తను కుంచుకుపోయేక, దీనత పొయేక, తనలో అల్పత్వభావన కలిగేక, నిద్రపోతున్నట్టు నటించే అతను, తను నిజంగా నిద్రపోగానే, ఏ అర్ధరాత్రికో కిందికి దిగి, చీకట్లో తనని దగ్గరగా తీసుకొని, తన నప్పుడు ఆకాశాని కెత్తుతాడు పొగడ్తలతో. అప్పుడు తన. కృతజ్ఞతతో అతని బాహువులలోకి ఒరిగిపోవాలి. . ఒరగకపోయినా, ఒరిగించుకుంటాడు.

ఆమెకి ఎన్నో ఆలోచనలతో నిద్ర పట్టలేదు. అతను మీద బెర్తుమీద హాయిగా నిద్రపోతున్నాడు. ఆమె పిచ్చిపిచ్చి ఊహలతో సతమతమయి, జాగరం ఉందామని ప్రయత్నించి అలానే ఆలోచిస్తూ రాత్రి మూడింటికి నిద్రపోయింది.

• • •

ఆమె ఉలిక్కిపడి లేచి కూర్చొని కిటికీలోంచి చూసింది. ఎండ బాగా వచ్చేసింది. కళ్ళు నులువుకొని, నమ్మలేనట్టు కలియజూసింది. లేచి నిల్చొని బెర్తు మీద చూసింది. అతను లేడు. ఇది కలా! నిజమా? తను భయపడినట్టు ఏమీ కాలేదే! ఏమిటి ఇతని ప్రవర్తనకి అర్థం? ఇతను నిజంగా మంచివాడా? లేదా తనతో నాటకం ఆడుతున్నాడా? లేదా, తను లొంగదని తెలుసుకుని, తనని కోరి అవమానించి (నిరసన చూపి) కసి తీర్చుకుంటున్నాడా?

పక్క స్టేషన్‌లో రైలు ఆగగానే, వేణుగోపాల్ కంపార్టుమెంటులోకి వచ్చేడు ఫలహారం పట్టించు కొని. ఆమెని చూస్తూనే అన్నాడు: "బాగానే నిద్ర తీసేరు. ఇప్పు డెంత సమయం అయిందో తెలుసా? పగలు పదిగంటలు! మొహాలు కడుక్కొని రండి. ఫలహారం చేద్దాం."

ఆ ఉత్సాహంలో, ఆ ఆప్యాయతలో అతడిలో ఏదో వింత ఆకర్షణ, నిండుదనం ఆమెకు కనిపించేయి. ఆమె వింతగా అతడికేసి చూసి, ఏమీ అర్థం పాక, లేచి, సబ్బూ, టవలూ, పౌడరూ, బట్టలూ పెట్లోంచి తీసి, బాత్‌రూమ్‌కి వెళ్లింది.

ఆమె తిరిగి వచ్చేసరికి అతను అంత సరంజామా పేర్చి ఉంచేడు. ఆమె ఎంతో అందంగా ఉంది ఆ ఉదయం. అతడు క్రితంరాత్రి వర్ణించిన మహాసౌందర్యవతి శకుంతలలా కొప్పునిండా మల్లెలు, దవనం, మరువం స్టేషన్‌లో కొని ముడుచుకొంది. తెల్లటి చీర, ఎర్రటి రవిక. నడకలో ఒయ్యారం . . . హొయలు . . .

అత డామెను చిరునవ్వుతో సత్కరించి. . . "రండి! మీకే ఆలస్యం" అని తినడానికి ఉపక్రమించేడు.

అతడు తన అందాన్ని వర్ణిస్తాడనుకుంది. తన అందాన్ని కళ్లతో తాగేస్తాడనుకుంది. అతడు అటువంటి పనులేమీ చెయ్యలేదు. ఫలహారం చేసి, కాఫీ తాగి, కైటసు చూస్తూ కూర్చున్నాడు.

ఆమె అతడికేసి చూసింది. ఈ మనిషి చిత్రమైన మనిషి. అతడిలో అంత ప్రచండమైన ఆకర్షణ ఉందని అతడికి తెలుసు. కోరకుండానే తమంత తామే స్త్రీలు ఆకర్షింపబడతారని అతని అహంభావం! ఆ అహానికి తను దెబ్బకొట్టింది. ఎందుకంటే, అతడు ఇంత కృషి చేసినా, పొగిడినా, ప్రయత్నించినా, తను లొంగలేదు. అందుకే కోపం కామోసు. శ్యామల చేసినట్టు తనూ ప్రాయశ్చిత్తం చేస్తుందని భయపడి రాత్రి తన జోలికి రాలేదు. అతడు వేసిన ఉచ్చులో చిక్కుకోలేదని, ఇప్పుడు మరొక ఉచ్చు. నిర్లక్ష్యం నటిస్తే ఆకర్షింపబడుతుందని.

లేదా తను అతణ్ణి ఆకర్షించలేకపోతూందా? ఇన్నాళ్లూ అతణ్ణి ఆకర్షించిన తన అందం ఒక్కసారి మాయమవ గలదా? తను ఎంతో అందగత్తె. ఎందరినో కోతులుగా చేసి ఆడించింది. మరి ఈ మనిషి? ఆడిస్తే కాటువేసే పామా ఇతడు? సరే, ఆడిస్తాను... కాటు వెయ్యడానికి ప్రయత్నింపచేయనిస్తాను. రెచ్చగొడతాను. . . కాటు వేసే సమయానికి కర్రతో తలమీద బాది పాముని చంపుతాను అనుకొని రంగంలోకి దిగింది ఇందిర.

ఆమె అంది నవ్వుతూ: "నిన్న రాత్రి మీ నాటకం చూసి నిజంగా భయపడ్డాను! ఒంటరి ఆడదాన్ని. . . అందమైనదాన్ని. . , మీరా బ్రహ్మచారి. . . ఏ రాత్రి కేం అఘాయిత్యం తలపెడతారో అని భయంతో మూడు వరకూ మెలకువతోనే ఉన్నాను. అప్పు డెలాగో నిద్ర పట్టింది." ఆ మాటలని ఆమె కొంటెగా ముఖం పెట్టి నవ్వింది.

అతడు విద్యుద్ఘాతం తిన్నవాడిలా మ్రాన్పడి అన్నాడు: "ఛా! ఛా! ఎంత మాటన్నారు!"


కాఫీ ట్రే అతను తియ్యబోతూ ఉండగా, ఆమె కోరి తన వేళ్లతో అతడి వేలివేళ్లను నొక్కి అంది: "ఇవి ఆడవాళ్ళు చెయ్యవలసిన పనులు. . . మగవాళ్ల పనులు కావు. . ." అని అతని కళ్లలోకి చూసి, కళ్లతో నవ్వింది.

అతను: షాక్ తిన్నట్టు చెయ్యి వెనకకు తీసుకొని అన్నాడు: "మీ కెందుకండీ శ్రమ. . .!"

ఆమె పకపకా నవ్వింది. నవ్వి అంది: "ఎప్పుడూ మా శ్రీవారి ఎదటే నా అందాన్ని వర్ణించి భట్రాజు లయ్యేవారే? ఇప్పుడు చెప్పండి! మీ కంటికి ఎలా కనిపిస్తున్నాను? మీ రన్న మహాసౌందర్యాల కనిపిస్తూందా? లేక వెగటు కలిగిస్తున్నానా. . ."

వేణుగోపాల్‌కి చెమట్లు పోసేయి. లేచి అన్నాడు: "మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు . . . నేను మీరు అనుకుంటున్న రకం మనిషిని కాను. . . మనుష్యులకి అందం మనస్సుబట్టే ఉంటుందండీ. . . ఎవరి మనస్సు సుందరమో వారే సుందరులు. . . శరీరమే సుందరమైతే నిర్జీవశిల్పాలే ఎక్కువ సౌందర్యవంత మైనవి. నా స్నేహితులలో నేను చూసేది ఆత్మసౌందర్యం . . . మీరు నన్ను అపార్థం చేసుకున్నారు. . .!"

ఎవరో కత్తితో పొడిచినట్టు ఆమె కూలబడింది. అవమానంతోనూ, కోపంతోనూ కంపించింది. "అపార్థం చేసుకుంటున్నారు! నే నటువంటివాడిని కాను!. . ." అంటే ఉద్దేశం? అతడు సద్గుణవంతుడని, తను కులటఅని భావించి అన్నాడు. అతడు నిజంగా సద్గుణుడు కాకపోవచ్చు. కాని తను అతడి నైజం తెలుసుకుందుకి తనని తను అతడిముందు కించపరుచు కోగా, అతడు ఎంత నీచుడైనా పెద్ద మొనగాడిలా, ఉత్తముడిలా నటించి, తన పగ తీర్చుకున్నాడు. ఆమె మనస్సు భగ్నమయింది. . . తను ఉద్దేశించిన దొకటి, జరిగిన దొకటి. దెబ్బ కొట్టబోయి, తనే దెబ్బ తింది. ఆమె లేచి గట్టిగా అరవబోయింది. కాని నిందొక్కుకుంది. కోపాన్ని దిగమింగింది. నవ్వు తెచ్చుకొని గలగలా నవ్విఅంది హాస్యంగా: "మీరే నన్ను అపార్థం చేసుకున్నారు. . . మీరు మంచివారు కారని విన్నాను. . . మీ నాటకం చూడగా



''అంబర చుంబి సౌధముల...''
ఫోటో—బి. నాగేందర్ (సికిందరాబాదు-3)

అలానే అనిపించింది. . . నిజం ఏమిటో తెలుసుకోవాలనే ఈ నాటకమాడేను. . ."

అతనూ పకపకా నవ్వేసేడు.

• • •

కొన్ని నెలలు గడిచిపోయేయి.

శ్యామలకి ఒకసారి ఉత్తరం రాస్తూ, ఇందిర ఇలా రాసింది:

"వేణుగోపాల్ అని [illegible] ఉండేవాడు, తెలుసు కదా? ఏవాడయ్యో బదిలీ చేయించుకుపోయేడు మొహం చెల్లక. నువ్వు అతణ్ణి గురించి చెప్పింది అక్షరాలా నిజం! మరునాటినించే నావెంట పడ్డాడు. నేను జాగర్తలో ఉన్నా, ఒకసారి ఏమయిందంటే. . ." ఇక్కడ ఆ నాటి రైలుప్రయాణం గురించి రాసింది. "నిద్రలో సడన్‌గా మెలకువ వచ్చింది. చీకట్లో నన్ను దగ్గిరగా లాక్కుంటున్నాడు. కెవ్వున కేకవేసి, అతడి ముఖాన్ని రక్కి, తప్పించుకుని లైటు వేసేను. . .

ఉచిత బహుమతి
ఆకర్షణీయమైన 1969 కాలెండరు
రామతీర్థ బ్రాహ్మీ ఆయిల్ ఒక పెద్ద సైజు సీసా లేక రెండు చిన్న సైజు సీసాల ప్రతి కొనుబడికిని అందమైన, ఆకర్షణీయమైన 1969వ సంవత్సరపు కాలెండరు ఉచిత బహుమతిగ ఇవ్వబడుచున్నది.
మీకు కావలసిన వాటిని మీ సమీపపు స్టోరులో కొనుక్కొని మా ఈ ఉచిత బహుమతిని పొందండి.
ప్రకటించినది :
శ్రీ రామతీర్థ యోగాశ్రమం, దాదర్, బొంబాయి-14.

మృదువైన, ఆరోగ్యవంతమైన
పట్టువంటి మెత్తటి జుట్టుకు....
కేశవర్ధిని
వాడండి




30 ఏండ్లపైబడి
ఇంటింటా పేరు పొందినది
మెత్తటి, సువాసన గల జుట్టుకు
కేశవర్ధిని షాంపూ
వాడండి.
కేశవర్ధిని ప్రాడక్ట్స్
మద్రాసు-14

ఎదురుగా నిల్చున్నాడు రోషిలా. . . పెద్దగా ఏడవడం ఆరంభించగానే పాదాలమీద పడ్డాడు. . . నేను మరి నిద్రపోలేదు. . . ఏడుస్తూ కూర్చున్నాను. అతడు పక్కపెట్టెలోకి పోయేడు . . . మానవ్వైతం బహువిచిత్రం సుమా. . ."

కొన్నాళ్లకి శ్యామలనించి జవాబు వచ్చింది.
"ఇందూ!

నువ్వెప్పుడూ అదృష్టవంతురాలివే! నేనే అర్థంచగా లేదిది, మహాసౌందర్యవతివి, నువ్వు అతన్ని పిచ్చివాణ్ణి చెయ్యడమేం వింత!

—శ్యామల."

ఆ రోజు భర్తతో సినిమాకి వెళ్దామని అలంకరించుకొని ఉండగా ఈ ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చదవగానే ఇందిర ముఖం పాలిపోయింది. ఉత్తరాన్ని ముక్కలుగా చేసి కుంపట్లో పడేసింది. ఆమెలోని ఉత్సాహమంతా పోయింది. జీవం లేనిదానిలా సోఫాలో కూలబడింది. ఇంతలో శ్రీధర్ వచ్చి, ఆమెని చూసి ఆశ్చర్యం నటించి అన్నాడు: "ఎంత అందంగా ఉన్నావో చెప్పనా? కాళిదాసు వర్ణించిన శకుంతలలా!"

ఇందిర మెరుపులా లేచి పిడుగులా గర్జించింది. "అందం. . . అందం. . అందం! వెధవ అందం! మరెప్పుడూ నన్ను పొగడకండి. . . ఇవాళ నేను సినిమాకి రాను. తలపోటుతో ప్రాణం పోతూంది నాకు!"

శ్రీధర్ స్తబ్దుడయి నిల్చుండిపోయేడు. క్షణం పోయాక తేరుకొని అన్నాడు: "అవును. . . నువ్వన్నది నిజమే! అందంలో ఏముంది! పాపం, వేణుగోపాల్ గతి ఏమయిందో తెలుసా. . .? రేపు చెబుదామనుకున్నానుకాని. . ."

ఆమె ఆత్రంగా అడిగింది: "ఏమయింది?"

"చాలా దుఃఖకరమైన వార్త! వేణుకి స్మాల్‌పాక్స్ వచ్చింది. ప్రాణాలతో బయటపడ్డాడు. ముఖంనిండా గుంటలు పడ్డాయి. ఒంట్లో ప్రాణాలు లేవు. . . ఒక కన్ను పోయింది. . ." శ్రీధర్ కళ్ళు తుడుచుకున్నాడు.

ఆమె కొయ్యబారిపోయింది క్షణకాలం. క్రమేపీ తేరుకొని, పేలవంగా అంది: "అయ్యో, పాపం!"

ఇద్దరూ మౌనంగా ఉండిపోయేరు. ఆమె నిట్టూర్చి అంది: "ఈ వార్త విన్నాక మనస్సు విచారంగా ఉంది. పిక్చర్‌కే పోదాం, పదండి . . . విచారం తగ్గుతుంది. . ."

ఆమె గదిలోకి వెళ్లి కొంతసేపయాక వచ్చింది. దుస్తులన్నీ మార్చేసింది. చాలా అందంగా అలంకరించుకుంది. తెల్లటి చీర, ఎర్రటి రవిక. కొప్పునిండా మల్లెలు, దవనం, మరువం. . . కాళిదాసు వర్ణించిన శకుంతలలా ఉంది.

శ్రీధర్ విస్తుబోయి చూసి అన్నాడు: "కోపం తెచ్చుకోకపోతే ఒక మాట అంటాను. నువ్వు అనవద్దన్నవంగానే. . .నువ్వు నిజంగా శకుంతలలా ఉన్నావు."

ఆమెకు కోపం రాలేదు. ఆమె మనస్సు ఎందుకో తేలికపడింది. ఏదో అవ్యక్తమైన ఆనందంతో నింగిలో విహరిస్తుందిం దెందుకో. ఆ మాటలు ఎంతో చల్లగా, హాయిగా వినిపించగా అతడికేసి క్రీగంట చూసి, మెరుస్తున్న కళ్లతో నవ్వి అంది: "నిజంగా?" ★